
# శ్రీ అరవిందుల సాహిత్యం-ప్రతీకలు



డా॥ జి.అరుణకుమారి

# ప్రతీక

ప్రపంచంలో ప్రతివస్తువు ఏదో ఒక సత్యానికి ప్రతీక అవుతుంది. మరో వస్తువుకు సంబంధించిన సత్యానికి ప్రాతినిధ్యం వహించే రూపం ప్రతీక. ఉదాహరణకు జాతీయ జెండా ఒక దేశానికి ప్రతీక. పావురం శాంతికి ప్రతీక. దేహం యదార్థ సత్తకు ప్రతీక. జెండా, పావురం, దేహం కంటికి కనిపిస్తాయి. దేశం, శాంతి, యదార్థ సత్త అనుభూతమయ్యే అమూర్త భావానికి చెందినవి. అమూర్తమైన తత్త్వానికి ప్రాతినిధ్యం వహించే మూర్తి మత్వమే ప్రతీక. కచ్చితంగా చెప్పాలంటే అన్ని రూపాలు ప్రతీకలే. ప్రతీకలు పలు రకాలుగా పరిగణింపబడుతున్నాయి. పండితులు పరిశోధకులు ప్రతీకలను అనేక రకాలుగా వర్గీకరించారు. వైదిక ప్రతీకలు, పురాణ ప్రతీకలు, క్రైస్తవ ప్రతీకలు వంటి మతపరమైన ప్రతీకలను సంప్రదాయ ప్రతీకలుగా పరిగణిస్తున్నారు. జీవన ప్రతీకలు, మానసిక ప్రతీకలు, స్వయం శక్తిగల ప్రతీకలు, చర, స్థిర ప్రతీకలు స్వాప్నిక ప్రతీకలు, సాధన ప్రతీకలు అని శాస్త్రానుసారం ప్రతీకలు పలురకాలు. స్థిరమైన తత్త్వంలో నిలిచిపోయే ప్రతీకలు కొన్నయితే కాలానుగుణంగా మార్పులకు లోనయ్యే ప్రతీకలు కొన్ని. ఉదా: ఆకాశం అనంతానికి ప్రతీక. అన్ని దేశాలకు వర్తిస్తుంది. గులాబి పువ్వు కాలానుగుణంగా కవి భావుకతను అనుసరించి మార్పులకు లోనయ్యింది.

వైదిక, పురాణ, మత ప్రతీకలు సంప్రదాయ ప్రతీకలుగా పరిగణింపబడుతున్నాయి. నారాయణుడు అనగానే పాలకడలి, సర్పం, పద్మం మొదలైన వస్తుగత తత్త్వమంతా సుబోధమవుతుంది. నారాయణుడు దిక్కులకు, కాలాలకు, జలాలకు అధిపతి. సృష్టికి సృష్టికి మధ్య విశ్వరక్షా మూల సూత్రాన్ని బీజరూపంలోతనలోనే నిబిడీకృతం చేసుకుంటాడు. నారాయణుని బొడ్డు ప్రాణశక్తికి మూలాధారం. జీవసూత్రం. బొడ్డులోని బీజం ద్వారా సృష్టి కర్త అయిన బ్రహ్మ పద్మం నుండి జనిస్తాడు. పద్మం విశ్వసచేతనకు సంకేతం. అనంతుడనే సర్పం అన్ని దిక్కులు, కాలాలలోను విశ్వనిర్మాణ శక్తిగా నిలుస్తాడు.

సృష్టి గతిశీలతను సూచించేది సుదర్శన చక్రం. వలయాకార భ్రమణం, శక్తిగతిశీలతను తెలియజేస్తుంది. ఆధ్యాత్మిక ఆహ్వానాన్ని సాక్షాత్కారాన్ని సూచించేవి మురళి, శంఖం. శంఖం విజయ ప్రకటనకు ప్రతీక. లక్ష్యసాధనా శక్తికి బాణం ప్రతీక.

**సాంప్రదాయిక ప్రతీకలు**

వేదకాలంనాటి ఋషులు తమ చుట్టూ ఉన్న పరిసరాల నుంచి స్వీకరించినవి సాంప్రదాయిక ప్రతీకలు. గోవు ప్రకాశానికి ప్రతీక. గోశబ్దానికి ఆవు అని కాంతికిరణమనే అర్థాలు వ్యవహారంలో ఉన్నాయి. ఆవు ఆనాటి ప్రజల జీవనోపాధికి ఆలంబనకావటం వలన దానిని విలువైన ఆస్తిగా భావించేవారు. దొంగిలిస్తారనే భయంతో దానిని జాగ్రత్తగా కాపాడుకునేవారు. ఇటువంటి భావం రూపొందినపుడు అది సజీవ ప్రతీక అవుతుంది. ఆపై ఋషులు దానికి ప్రాణిక రూపాన్నిచ్చి విస్తృత పరచి ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను కల్పించారు. అశ్వాన్ని శక్తికి బలానికి వేగానికి ప్రతీకగా భావించడం కూడ ఇటువంటిదే.

**సాధన ప్రతీకలు :-** అగ్ని, దీపాలు, సూర్యుడు, చంద్రుడు మొదలైనవి సాధనలో కనిపించే ప్రతికలే. ఇవి అంతర శక్తుల చలన శీలతను సూచిస్తాయి. సాధనలో ప్రత్యేక దశలో శక్తులు పనిచేస్తున్నప్పుడు అంతరసత్యం కనిపిస్తుంది.

**సూర్యుడు :-** అత్యున్నత సత్య తేజానికి ప్రతీక సూర్యుడు. నిజమైన భౌతిక చైతన్యానికి ప్రతీక ఎర్రటి సూర్యుడు. ప్రస్తుతం మానవులలో, అస్పష్టంగా ఉండే అమాయక భౌతిక సచేతన స్థానాన్ని ఆక్రమించేది ఇదే. సత్య ప్రకాశమే సూర్యుడు. ప్రకాశం సచేతన దీప్తిని సూచిస్తుంది. సూర్యుడు దైవిక సత్యం. భూమ్మీద దైవత్వం రూపుదిద్దు కుంటుందని ఇది సూచిస్తుంది. ఇలలోని సచేతనను సత్యం వైపు మరలిస్తుంది.

**చంద్రుడు :-** చంద్రుడు ప్రతీకగా దృష్టి గోచరమవడం మనసులోని ఆధ్యాత్మికతను గాని, ఆధ్యాత్మిక సచేతనను గాని, ఆధ్యాత్మిక ఆనంద ప్రవాహాన్ని గాని సూచిస్తుంది. ఇది ఆత్మ సత్యాలను గ్రహించి ప్రతిబింబింపచేస్తుంది. సూర్యుడు సత్య ప్రకాశమయితే చంద్రుడు కేవలం సత్య ప్రకాశాన్ని ప్రతిబింబింపచేస్తాడు. అదే తేడా. బంగారు

చంద్రుడు అత్యున్నత సత్యాన్ని సూచించే ఆధ్యాత్మిక శక్తి. ఆధ్యాత్మిక తేజం. మానసిక స్థితులకు సంబంధించి చంద్రుడు ఆధ్యాత్మికతకు ప్రతీక.

**ఆకాశం :-** అకాశం మానసిక సచేతనత్వానికి సంకేతం. మనసుకు మించిన సచేతనను కూడా ఇది సూచిస్తుంది. అనంతత్వాన్ని కూడా సంకేతిస్తుంది. నీలాకాశం ఉన్నత మనస్సుకు అతి మనస్సుకు (Supermind) సమీపంగా ఉండే స్థితిని తెలియజేస్తుంది.

**వర్షం :** దైవకృప అవరోహణకు ఆధ్యాత్మిక సంపదలకు కారణమైన ఉన్నత సచేతనను సూచిస్తుంది.

**ఇంద్ర ధనస్సు :** శాంతికి, రక్షణకు ప్రతీక.

**మేఘాలు :** అస్పష్టతకు ప్రతీక.

**నక్షత్రం :-** నక్షత్రం సృష్టిని, నిర్మాణాన్ని, వాగ్ధానాన్ని, సృష్టి శక్తిని, నిర్మాణ శక్తిని సూచిస్తుంది. రాబోయే ప్రకాశాన్ని సూచించే వాగ్దానం నక్షత్రం. ప్రకాశం అవతరించినప్పుడు నక్షత్రం సూర్యుడుగా మారుతుంది. అమాయక మానవ సచేతనలోని కాంతిక్షేత్రాలను నక్షత్రం సూచిస్తుంది. తేజో ఆరంభాలను నక్షత్రాలు సూచిస్తాయి.

సక్రమంగా రూపుదిద్దుకున్న ఆలోచన ప్రదీప్తం కావడం తేజోపుంజంగా కనిపిస్తుంది. తళుక్కుమనడం, కాంతి కదలికలు సచేతనలో గాని, దాని చుట్టూ ఉన్న శక్తుల కార్యాలను గాని సూచిస్తాయి.

**అగ్ని :-** అగ్ని గతిశీల కార్యాన్ని సూచిస్తుంది.

**దీపం :** మానవుడు ఏకాగ్రతలో చూసే దీపాలు, వివిధ శక్తుల ప్రకాశాలు. ఇవి తరచుగా ఉన్నత సచేతన నుంచి వచ్చినవై ఉంటాయి.

**ఉదయం :** ఆరంభానికి

**రాత్రి :** అవిద్య, అజ్ఞానాలకు,

**తేజస్సు :** సత్యానికి, విజ్ఞానానికి ప్రతీక.

**పర్వతాలు :** అధిరోహణ స్థితిని సూచించే ఉన్నత సచేతన. పర్వత శిఖరం దైవ సాన్నిధ్యాన్ని సూచిస్తుంది.

**నీరు :** సచేతన స్థితికి ప్రతీక.

**సముద్రం :** సముద్రం సాధారణ సచేతనకు ఉన్నత సచేతనకు ప్రతీక. దీనిపైన సత్యసూర్యుడుంటాడు. కొన్నిసార్లు సచేతనలేని కొంత భాగం చెరువుగానో, సరస్సుగానో, సముద్రంగానో కనిపిస్తుంది.

**నది :** సచేతనలోని కదలికలకు ప్రాతినిధ్యం వహిస్తుంది.

**చేప :** రకరకాల రూపకల్పనలు చేస్తూ తిరిగే ప్రాణిక మనస్సుకు ప్రతీక.

**కప్ప :** నిరాడంబర ప్రయోజకత్వాన్ని సూచిస్తుంది.

**సర్పం :** నిత్యం ఏదో ఒక శక్తిని సూచిస్తుంది. తరచుగా చెడును సంకేతిస్తుంది. ఒక్కొక్కసారి ఇది దివ్యశక్తిని, క్రియా సాఫల్యాన్ని సూచిస్తుంది. శిరస్సుపై పడగ విప్పిన పాము భవిష్యత్తులో రాబోయే సిద్ధిని సూచిస్తుంది. ఒక దానితో ఒకటి పెనవేసుకున్న రెండు సర్పాలు-వెన్నెముకలో పైకి కిందికి శక్తి ప్రవహించే మార్గాలు. ఆరుతలలున్న సర్పం కుండలినీ శక్తిని సంకేతిస్తుంది. ఇది భౌతిక శరీరంలో కింద ఎక్కడో గాఢ నిద్రలో ఉండి యోగం ద్వారా మేల్కొని తెరచిన కేంద్రాల ద్వారా వెలుతురులో చేరి అత్యున్నత కేంద్రంలో దివ్యత్వాన్ని చేరి రూపారూపాలను, ఆత్మను పదార్థాన్ని కలుపుతుంది. సర్పం శక్తికి అధికారానికి సంకేతం.

**సాలెపురుగు :** ఉపనిషత్తులలో సాలెపురుగును బ్రహ్మ సృష్టికి ప్రతీకగా వాడారు. తానే సృష్టించి దానిలోనే తిరుగుతూ దానిలోనే అంతమవుతుంది.

**గోవు :** వేద మంత్ర ప్రతీకలలో గోవు దివ్య తేజస్సును, తెల్లని ఆవు స్వచ్ఛమైన సచేతనను సూచిస్తుంది.

**సింహం :** ఉన్నత ప్రాణ శక్తిని, ధైర్యాన్ని, బలాన్ని, అధికారాన్ని సూచిస్తుంది. ఆధ్యాత్మిక సచేతనతో దీప్తమైన సంపూర్ణ ప్రకాశాన్ని సంకేతిస్తుంది.

**సింహిక :** నిమ్న ప్రాణం (Lower Vital) సింహం వంటిది కాదు.

**పులి :** క్రోధం, ద్వేషం కనబరిస్తే విపరీత శక్తికి రూపమై ఉంటుంది. లేకపోయినట్లయితే

**ఏనుగు :** బలానికి, తెలివితో కూడిన బలానికి సంకేతం. కొన్ని సందర్భాలలో అవరోధాలను తొలగించే శక్తికి ప్రతీక.

**అశ్వం :** గతిశీలతకి, సాధారణంగా ప్రాణశక్తికి, అభివృద్ధికై పనిచేసే శక్తికి, చలనశీలతగల అశ్వమైతే మానసిక శక్తికి, తపస్సుకి ప్రతీకగా నిలుస్తుంది.

**వృషభం :** శివుని వాహనం వృషభం. బలానికి, శక్తికి చిహ్నం. వేదాలలో భగవంతుని రూపంగాను, ప్రకృతిలోని పురుష శక్తిగాను నిలిచింది. ★

**దున్నపోతు :** ప్రకృతిలోని నిగూఢమైన హింసను సూచిస్తుంది. ఇక్కడ నియంత్రణార్థం కనిపిస్తుంది. ప్రతీకాత్మకమైతే, దేనిని సూచిస్తుందో స్పష్టంగా చెప్పలేం.

**గాడిద :** శరీరంలోని అవరోధాలకు, జడత్వానికి ప్రతీక

**లేడి :** ఆధ్యాత్మిక అభివృద్ధిలోని వేగానికి ప్రతీక

**మేక :** విషయేచ్ఛకు ప్రతీక

**కుక్క :** భక్తి విశ్వాస వినయాలకు ప్రతీక.

**పక్షి :** తరచుగా వ్యక్తి ఆత్మను సంకేతించే ప్రతీక.

**హంస :** ఉన్నత స్థితిలోని వ్యక్తి ఆత్మకు ప్రతీక. ఇది కేంద్రసత్తగా, దివ్యత్వం వైపు పయనించే దివ్యభావంగా పరిగణింపబడుతుంది.

**బాతు :** ఆత్మకు ప్రతీక. వెండిలా మెరిసే తెల్లటిరంగు ఆధ్యాత్మిక సచేతనను, బంగారు రెక్కలు దివ్యసత్యాన్ని సూచిస్తాయి.

**పావురం :** శాంతిని

**నెమలి :** విజయాన్ని, ఆధ్యాత్మిక సాఫల్యాన్ని సూచిస్తుంది.

**నిప్పుకోడి :** చలనశీల వేగాన్ని సూచిస్తుంది.

**చెట్టు :** ప్రాణిక, ఉప చేతనకు, విశ్వానికి, ప్రాణానికి ప్రతీక. ప్రాణిక, ఉపచేతనలు ఉన్నత మనస్సు, స్వతఃస్ఫురణ అధిమనస్సు మొదలైన వాటికి ప్రతీకగా నిలుస్తుంది.

**పుష్పాలు :** మానసిక చైతన్యాన్ని, వికసిస్తున్న సచేతనని, కొన్ని సందర్భాలలో ప్రాణిక, మానసిక, భౌతిక సచేతనను సూచిస్తాయి. పద్మం స్వేచ్ఛా సచేతనను సూచిస్తుంది. తేజస్సుకోసం కేంద్రాలను తెరచి ఉంచటానికి పద్మం ప్రతీకగా నిలుస్తుంది. ఎర్రని పద్మం భూమ్మీద దైవత్వాన్ని సూచిస్తుంది. ఎరుపు కలిసిన గులాబి మానసిక ప్రేమ లేదా దాసోహాన్ని సంకేతిస్తుంది. తెల్ల గులాబి సంపూర్ణ ఆధ్యాత్మిక దాసోహాన్ని ఎర్రని పుష్పాలు సాధారణంగా భౌతిక ప్రాణిక శక్తుల సచేతన ఆరంభాన్ని సూచిస్తాయి.

**పండ్లు :** సాధన ఫలితాలకు ప్రతీక.

**రంగులు :** మానసిక భౌతిక, జీవ శక్తులను సూచిస్తాయి.

రంగు, తేజస్సు రెండు ఒకదానికొకటి చాలా సన్నిహితంగా ఉంటాయి. రంగు సూచనాత్మకంగాను, తేజస్సు గతిశీలంగాను ఉంటాయి. రంగు ప్రదీప్తమై ప్రకాశంగా మారుతుంది. రంగుల సత్యాన్ని కచ్చితంగా అన్ని వేళలా చెప్పటం సాధ్యం కాదు. రంగాన్ని బట్టి, రంగుల ఛాయలను బట్టి, శక్తుల చర్యలను బట్టి వీటి అర్థం మారుతూ ఉంటుంది. కాబట్టి ఇది సంక్లిష్టమైనది.

**బంగారు రంగు :** అతిమానసిక సత్యచేతన నుంచి ఆంతరిక సత్యాన్ని కానీ అధిమానసిక సత్యాన్నిగానీ సూచిస్తుంది.

**పసుపు రంగు :** ప్రాణులకు ప్రత్యేక రంగులు లేవు. మనసును సూచించే రంగు పసుపు. ఒక రకమైన పసుపు బుద్ధిని, మేధను సూచిస్తుందని తాంత్రికులు నమ్ముతారు. మానసిక స్థితిని గులాబి లేదా లేత గులాబి సూచిస్తుంది. ప్రాణ శక్తిని ఉదా రంగు సూచిస్తుంది. ఇవి ప్రాణుల రంగులు కావు. ఒక్కొక్క సారి ఆకు పచ్చ, ముదురు ఎరుపు, ఊదా రంగు (ధూమ్ర వర్ణం) ప్రాణిక శక్తులను సూచించవచ్చు. ప్రతికూల ప్రాణిక శక్తులను సూచించే మరికొన్ని రంగులు కూడా ఉన్నాయి.

**ఊదా రంగు :** వెలుతురుకు, దైవ కృపకు, కరుణకు గుర్తు. ఊదారంగు ప్రాణశక్తి రంగు.

**ఆకుపచ్చ :** ప్రాణ సంబంధమైనది. శక్తుల గతిశీలతను, తరచుగా జీవ ఉద్వేగ శక్తిని సూచిస్తుంది.

**ఎరుపు :** భౌతిక చిహ్నం. ఎర్రటి వజ్రం భౌతిక శరీరంలోని దివ్య (శ్రీమాత) సచేతన. ఎరుపుకు ఛాయలను బట్టి అర్థాలు మారుతుంటాయి. దీనిని భౌతిక సచేతన రంగుగా భావించవచ్చు.

**నాలుగు తేజస్సులు :** ఇవి సత్యదీపాలు. తెలుపు స్వచ్ఛతకు, దైవిక సత్యానికి, ఆకుపచ్చ గతిశీలతను కలిగించే శక్తికి, నీలం దైవిక శక్తికి చెందిన ఆధ్యాత్మిక సచేతనకి, బంగారు రంగు విజ్ఞానానికి చిహ్నం.

**నీలం :** ఆధ్యాత్మిక స్థితులను సూచించే రంగు. నీలం ఉన్నత హృదయాన్ని సూచిస్తుంది. వెన్నెల ఆధ్యాత్మిక హృదయ ప్రకాశాన్ని సూచిస్తుంది. కొన్ని ప్రత్యేక శక్తుల గతిశీలత తేజస్సులో సూచితమవుతుంది. వీటిని వాటి రంగు ద్వారా గ్రహించవచ్చు. లేత నీలపు తేజస్సు ప్రదీప్తమైన మనసని, ముదురు నీలపు తేజస్సు ఉన్నత మనస్సుని సంకేతిస్తుంది. ఊదాలో కలిసే నీలం ప్రాణిక శక్తుల తేజస్సుగా గుర్తింపబడుతుంది.

వజ్రపు నీలం అధిమనస్సులో కృష్ణ తేజస్సు, వంగ రంగు నీలం స్వతః స్ఫురణ మనస్సు. నీలం రాధను సంకేతిస్తుంది.

**ఆకుపచ్చ కాంతి :** సందర్భాన్ని బట్టి రకరకాల విషయాలను సూచిస్తుంది. ఉద్వేగ ప్రధాన శక్తులకు సంబంధించి ఇది ఔద్వేగిక దాతృత్వాన్ని, ప్రాణిక సమృద్ధిని లేదా దాని వెనుక ఉన్న ప్రాణిక దాతృత్వాన్ని, ప్రాణ భౌతిక సంబంధాలలో ఆరోగ్యశక్తిని ప్రధానంగా తెలుపుతుంది.

**శ్వేత కాంతి :** స్వచ్ఛమైన దైవిక సచేతనా శక్తిని సూచిస్తుంది. వీటికి ఎల్ల వేళలా ఒకే అర్థం.

**బంగారు కాంతి :** అత్యున్నత స్థాయిలలోని దైవిక సత్యం. నారింజ లేదా ఎరుపు కలిసిన బంగారు వర్ణం భౌతిక శరీరంలోని అతిమానసిక తేజస్సు. ముదురు ఎరుపు ఆధ్యాత్మిక ప్రేమను లేత ఎరుపు మానసిక ప్రేమను సూచిస్తుంది. మానసిక తేజస్సు రంగు అది సూచించే విషయాన్ని బట్టి ఉంటుంది.

**ఉదాహరంగు :** దైవకృపా తేజస్సును, కృష్ణుని కృపను, రక్షణ తేజస్సును సూచిస్తుంది. నీలం కృష్ణుడు ప్రత్యక్షమైనపుడు వచ్చే కాంతి వలయపురంగు. అందుకనే ఆయనను నీలకృష్ణుడంటారు. నీలం అనే విశేషణం ఆయన శరీరపు రంగు కాదు.

ఈ విధంగా తెలుపు దైవిక సచేతనని, బంగారు తేజస్సు సత్యాన్ని, నీలం ఉన్నత ఆధ్యాత్మిక మనస్సుని, వంగ రంగు తేజస్సు దయను, విశ్వజనీన సహానుభూతిని సంకేతిస్తుంది.

### జీవన ప్రతీకలు

జీవన ప్రతీక ఒక ప్రయోజనాన్ని ఆశించి ప్రయత్న పూర్వకంగా చేసే మానసిక వ్యాఖ్యకాదు. ఇవి కృత్రిమంగా స్వీకరించినవి కావు. దైనందిన జీవితం నుండి పరిసరాల నుండి సహజంగా రూపొందుతాయి. ఇవి సామాన్య జీవనాన్ని నియంత్రించే ప్రతీకలు. ప్రాచీన ఋషులకు పర్వతం యోగ మార్గానికి ప్రతీక. పై స్థాయికి చేరటం, శత్రువులను ఎదుర్కొనటం, ప్రయాణం వంటి భావాలను కూడ స్ఫురింపజేస్తుంది.

### స్వశక్తి, స్వయం ప్రతిపత్తి గల ప్రతీకలు.

(అ) శాశ్వతమైన బ్రహ్మాండాన్ని ఆవరించిన ఆకాశం అనంతానికి ప్రతీక. అనంతం శాశ్వత బ్రహ్మకు ప్రతీక. అన్నిదేశాలలోను ఆకాశం అనంతాన్నే సూచిస్తుంది.

(ఆ) అతిమానసిక (Supramental) తేజానికి సూర్యుడు విశ్వజనీన ప్రతీక. అన్ని కాలాలలోను అన్ని దేశాలలోను ఒకే భావాన్ని స్ఫురింపజేసే ప్రతీకలు. స్వశక్తి, స్వయం ప్రతిపత్తి గల ప్రతీకలు.

### మానసిక ప్రతీకలు :

మానసిక ప్రతీకలు అంకెలు అక్షరాలు రేఖాగణిత బొమ్మలకు ప్రాతినిధ్యం వహిస్తాయి. ఈ బొమ్మలను రకరకాలుగా వ్యాఖ్యానించారు. శ్రీ అరవిందుల అనుభవంలో చదరం అధిమనస్సుకు (Supermind) ప్రతీక. ప్రాచీనులు అంకెలకు

సంబంధించి ఇటువంటి ఊహాలే కలిగి ఉండేవారు. వీరి విధానాలన్నీ ఎక్కువగా మానసికమైనవి. అన్ని మానసిక సూత్రాలు అతిమానసిక సత్యాలకు అనువాదాలే. ఈ మానసిక సూత్రాలు స్వభావ సిద్ధంగా నశ్వరాలు కావటంతో ఇవి నిత్యసత్యాలను చెప్పలేవు. ప్రతీకలుగా ఉండలేవు. క్రీస్తు పూర్వం 50 శతాబ్దాలకు పూర్వమున్న పైథాగరస్ బోధనలలో ముఖ్యమైన అంశాలలో అంకెల ప్రాముఖ్యం కూడా ఒకటి.

**స్వప్నాలలో ప్రతీకలు**

సత్తలోని ఏ భాగమైనా సంపూర్ణంగా అస్తిత్వం కోల్పోవలసి వచ్చినపుడు, ప్రకృతిలోని భాగంగా రూపుమాసిపోవలసి వచ్చినపుడు చనిపోయినట్లు కలవస్తుంది. అది చాలాచిన్న భాగమే కావచ్చు కాని ఈ విధానంలో వ్యక్తి సచేతన అంతా ఒకేచోట కేంద్రీకృతమై నేను చనిపోయాను అనే గుర్తింపు పొందుతుంది. "నేను చనిపోయాను. నన్నులేచి వెళ్ళిపోనివ్వండి" అంటే పనిపూర్తయింది. ఇంక ఈ భాగంతో నన్ను నేను గుర్తింపజేసుకోనవసరం లేదు. అయితే ఈ అనుభవంలో గతించినదేదో సూచన ఉండదు. సాధారణంగా కాలిపోవటమనే ప్రతీక భౌతిక శరీరం పవిత్రీ కరింపబడిందని తెలుపుతుంది.

ప్రత్యేకమైన భావనలు లేదా కల్పనలు సాధారణంగా ఆంతరిక అనుభవానికి ప్రతీకలు. కాని అవి ఇక్కడ క్లిష్టమైన రీతిలో కలిపివేయటం జరిగింది. ముసుగులో ఉన్న మానసిక మూలం నుంచి వచ్చే మానసిక జ్వాల అగ్నికి, పక్షి ఆత్మకు, రోజా పుష్పం ప్రేమకు, దాసోహానికి చిహ్నం. చంద్రుడు ఆధ్యాత్మికతకు ప్రతీక. ప్రాణ శక్తుల పెరగుదలను (Vital growths) అరికడుతూ మబ్బుల్లా ముసురుకున్న ఆంతరిక తమస్సు చిక్కుముడులను తెంచుకుని బయటపడేది నక్షత్రం. సాధారణంగా పడవకూడా ఆంతరిక దృష్టికి సంకేతమే. ఏనుగు ఆధ్యాత్మిక శక్తి, ఇది అవరోధాలను తొలగిస్తుంది. గుర్రం తపశ్శక్తికి ప్రతీక. ఇది ఆధ్యాత్మిక ఫలసిద్ధి వైపు పయనిస్తుంది. సూర్యుడు ఉన్నత సత్యానికి ప్రతీక. పద్మం అంతర సచేతనకు ప్రతీక.

ప్రతీకాత్మక స్వప్నంలో దంతాలు ఊడిపోతే పాతుకుపోయిన పాత అలవాట్లు భౌతిక మనస్సులోంచి పోతాయని చెప్పే ప్రతీక. సాధారణంగా కలలో కనిపించిన

బిడ్డ మానసిక వ్యక్తిని సూచిస్తుంది. అప్పుడే పుట్టిన బిడ్డ బయటపడింది అనే భావనని తెలుపుతుంది. బిడ్డ రంగు ఇది ఆరోగ్యంతో (అంతర, బహిర) ఉందని, ఆధ్యాత్మిక సంపత్తి ఉందని సూచిస్తుంది. చెవులు స్ఫూర్తినొందిన విజ్ఞాన ప్రదేశాన్ని తెలుపుతాయి.

ప్రాణిక స్థితిలోని కలలన్నీ అనుభవాలే. వాటిలో ప్రతీకాత్మక అంశాలున్నా అవి ప్రతీకాత్మకాలు కావు. మన సచేతన పనితీరును, సంబంధాలను, ప్రభావాలను మాత్రం తెలుపుతుంది. నిచ్చెన ఒక దశనుంచి మరోదశకు ఆరోహణను సూచించే ప్రతీక.

పాము శక్తిని - కొన్నిసార్లు మంచి శక్తిని, తరుచుగా దుష్ట శక్తిని సూచిస్తుంది. (ప్రాణిక లేదా ప్రతికూల). ఈ శక్తి నిశ్చలంగా ఉండి, ఆందోళనకరం కాకపోవచ్చు. కాని ఇది ఎలా ఉందోనని చూడటానికి దీనిని స్పృశించగానే మీరు దానిని మేల్కొలుపుతారు. దీనిని అదుపులో ఉంచటం, లేదా ఈ శక్తితో వ్యవహరించటం అంత సురక్షితం కాదని మీరు తెలుసుకుంటారు. ఇది ఏరకమైన శక్తో తెలియజేసే సూచన స్పష్టంగా ఉండదు. కలల్లోని ఈ అనుభవాలు మామూలుగా అవచేతన కలలవలె ఆలోచనలపై ఆధారపడిరావు. అవి కలలేకాని అనుభవాలు కావు. వాటికి ఒక జీవం, నిర్మాణం, నిర్వహణ, రూపం దేనికి దానికి ఒక అర్థం ఉన్నాయి. కాని అవి తరచుగా సాధనలోని ఆంతరిక స్థితి, అనుభవాలకు సంబంధించి ఉంటాయి. పుష్పోద్దంతం ప్రతీకాత్మకమా? లేక అంతరంగిక స్థితిలో జరిగిందా? అనేది స్పష్టంగా లేదు. మీకు ఇచ్చిన పుష్పమేదో తెలిస్తే అది దేనిని సూచిస్తుందో చెప్పటం సాధ్యమవుతుంది.

కలలన్నీ స్పష్టంగా, ప్రాణికలో కలిసే రూపాలే, ఇవి అరుదుగా మానసిక స్థితికి సంబంధించి ఉంటాయి. కొన్నిసార్లు అవి మీ మనసుకు చెందిన రూపాలు లేదా ప్రాణికకు చెందిన రూపాలుగా ఉంటాయి. కొన్నిసార్లు అవి మీ మనసులో మెరుగు పరచినవికాని, నిర్దుష్టమైనవి కాని ఉంటాయి. కొన్నిసార్లు ఏర్పడే ఈ రుపాలు ఇతర సమతలాల్లోని లేదా స్థితుల్లోని మానవేతర శక్తులు, ప్రాణులు ఏర్పరచినవై ఉంటాయి. ఇవి నిజాలు కావు. భౌతిక ప్రపంచంలో నిజం కావలసిన అవసరం

లేదు. అయినా అవి భౌతిక శరీరంపై ప్రభావం చూపడానికి ఉద్దేశించినవైతే వాటి ప్రభావం ఉండొచ్చు. ఒకవేళ వాటిని అనుమతిస్తే ఆంతర, బాహిర జీవితాల్లో అవి తరచుగా ప్రతీకాత్మకంగా ఉండి, వాటి అర్థాన్ని గుర్తించవచ్చు. వాటిని మామూలుగా పరిశీలించి, అవగాహన చేసుకోవటమే తగిన పద్ధతి. ఒకవేళ అవి ప్రతికూల శక్తినుంచి వచ్చినవైతే వాటిని తిరస్కరించాలి లేదా నాశనం చేయాలి.

మనం ఎదుర్కొనే పరిస్థితులకంటె భిన్నమైన పరిస్థితుల్లో జరిగే వాటికి నకలుగానో, ప్రాతినిధ్యం వహిస్తూనో వచ్చేకలలు కొన్ని ఉంటాయి. కొన్ని కలలు పూర్తిగా ప్రతీకాత్మకంగా ఉంటాయి. మనలోని కదలికలను, ప్రవృత్తులను చెబుతాయి. ఇవి జాగృతమనసుకు పరిచయమున్నవైనా, లేనివైనా, పాతజ్ఞాపకాలైనా, మనసు పొరల్లో నిక్షిప్తంగా ఉన్న విషయాలైనా, ఉపచేతనలో క్రియాశీలంగా ఉన్నవైనా, ఉన్నత చేతనకు వెళ్ళినపుడు వదిలేయ వలసినవో, మార్పు చేయవలసినవో అయిఉంటాయి. కలలను ఏ విధంగా వ్యాఖ్యానించాలో తెలిస్తే మన ప్రకృతికి, ఇతర ప్రకృతులకు సంబంధించిన రహస్యాలను గురించి తెలుసుకొనవచ్చు.

## సమాజ ప్రతీకాత్మక స్థితి

ఒక నాగరకతలో ప్రతీకాత్మక స్థితిలోని సమాజంలో ప్రతీకాత్మకత విస్తృతంగాను, కల్పనాత్మకంగాను ఉంటుంది.

వేదకాలంనాటి భారతీయ సమాజాన్ని అర్థం చేసికొనే స్థితిలో మనం లేం. మనం ఆ మనస్తత్వాన్ని కోల్పోయాం. మనకు ప్రతిదీ ప్రతీకాత్మకంగానే కనిపిస్తుంది. యజ్ఞ మనే ధార్మిక సంస్థ మొత్తం సమాజాన్ని పాలించింది. సమాజకాలమంతా, గంటలు, క్షణాలు యజ్ఞ కర్మలను వివరంగా ఆచరించటమేనని, బ్రాహ్మణాలు, ఉప నిషత్తులను పైపైన చూసినా తెలుస్తుంది. ఇవి మార్మికంగా ప్రతీకాత్మకాలు. ప్రకృతి దేవతలను ప్రసన్నం చేసికొని లౌకిక ప్రపంచంలోని సంపదలను, స్వర్గాన్ని పొందటమే యజ్ఞ లక్ష్యమనే సిద్ధాంతాన్ని మేధావుల, వ్యవహారిక వాదుల దృక్పథం ప్రభావితం చేసింది. మతం, మార్మికత, ప్రతీకవాదాలలో కూడ వ్యావహారిక దృక్పథాన్ని చూపి, ప్రాచీనుల స్ఫూర్తిని గ్రహించలేకపోయారు. మత సంబంధమైన ఆరాధనలకే కాక,

సామాజిక సంస్థలను కూడ తరచి తరచి ప్రతీకాత్మక దృష్టితో చూశారు. ఋగ్వేదంలోని ఒక సూక్తాన్ని పెళ్ళి మంత్రంగా దంపతలను కలపటానికి ఉపయోగించేవారు. దీనినే అనంతర వేదాకాలంలో కూడ ఉపయోగించేవారు. సూర్యుని కుమార్తె అయిన సూర్యకు వివిధ దేవతలతో జరిగిన వివాహాలకు గురించి ఈ సూక్తం చెబుతుంది. మానవ వివాహం దీనికంటె తక్కువదే అయినా ఈ దైవ, మార్మిక రూపాన్నే భావిస్తూ అదే పద్ధతిలో జరుపుతున్నారు. అయితే ఈ దివ్యవివాహం తదనంతర ప్రాచీన కవిత్వంలో చెప్పినట్లు మానవ కలయికను చెల్లుబాటు చేయటానికో, అలంకృత భావనో, కవితాత్మకమో కాదు. మరో విధంగా మానవుడు దివ్యునికన్నా తక్కువవాడు. కల్పనాత్మక దివ్యుడు. ఈ భేదమే అతిప్రాచీన మనస్తత్వానికి, ఆధునిక మనస్తత్వానికి విషయాలపట్ల ఉండే గౌరవాన్ని వ్యక్తం చేస్తుంది. ఈ ప్రతీకాత్మకతే భారతీయుల వివాహ భావాలను ప్రభావితం చేసింది. ఇవి అర్థం కాకపోయినా వీటినే ఇప్పటికీ సాంప్రదాయకంగా గుర్తు చేసుకుంటాం. భారతీయుల దృష్టిలో స్త్రీ, పురుషుల సంబంధం(వేదాలలో నృ, జ). స్త్రీ స్థితిగతులకి దీనికి మధ్య యథార్థంగా కొంత సహసంబంధం ఉంది. పురుషాధిక్యత ఉన్నా స్త్రీ పురుషునిలో అర్ధభాగంగా కలిసి ఉండేది. తొలి కాలంలో ప్రతీకాత్మకంగా స్త్రీ పురుషులిద్దరికీ సమానత్వం ఉండేది. తదనంతరం పురుషునికి లోబడి ప్రకృతి ఉండటంతో స్త్రీ కూడా పురుషునిపై ఆధారపడింది. అతనికోసమే జీవించింది. ఆమెకేమీ ఆధ్యాత్మిక అస్థిత్వం లేదు. తాంత్రికమైన శాక్తం స్త్రీని అత్యున్నత స్థానంలో నిలిపింది. సామాజికాచరణలో పెట్టటానికి కూడ యత్నం జరిగింది. కాని స్త్రీని ఉన్నత స్థితికి చేర్చి గౌరవాన్ని కల్పించి పూజించాలనే ఈ తాంత్రిక శాఖ కూడ వేదాంత భావాన్ని న్యూనపరచలేకపోయింది.

వేదకాలంనాటి చాతుర్వర్ణ వ్యవస్థను నాలుగు కులాల వ్యవస్థ అని మనం తప్పుగా అర్థం చెసికొన్నాం. కులం సాంద్రాయికమైతే వర్ణం సంకేతాత్మకమైన సంస్థ. సమాజాన్ని నాలుగు రకాలుగా గుర్తించడం రాజకీయ కారణాలచేత సంక్లిష్టమైన ఆర్థిక పరిణామ ఫలితంగా వచ్చింది. ఇక్కడ గుర్తుంచుకొనవలసిన ముఖ్యమైన విషయం – దీనిని ఆనాటి మానవులు అంతగా గుర్తించి ఉండకపోవచ్చు. ఈ

సామాజిక వ్యవస్థ మూలాంశాలకు యథార్థమైన భౌతిక కారణాలను కనుగొని సంతృప్తి చెంది మనం వీటిని అంతగా పట్టించుకొనలేదు. వారు భౌతిక కారణాలకు అంతగా విలువ నివ్వక, సంకేతాత్మక, మత, రాజకీయ ప్రాముఖ్యాన్ని ఎక్కువగా పరిగణించారు. సృష్టికర్త దేహంలోని తల, చేతులు, తొడలు, పాదాలు నుంచి నాలుగు వర్ణాలు పుట్టాయని పురుష సూక్తంలో ఉంది. మనకు ఇది కేవలం కల్పనాత్మక భావచిత్రం. బ్రాహ్మణులు విజ్ఞాన సంపన్నులని, క్షత్రియులు బల సంపన్నులని, వైశ్యులు సమాజావసరాలు తీర్చేవారని దీని అర్థం. కేవల కవితా కల్పనాత్మకమైన బ్రహ్మ శరీరం, సూర్య వివాహాలు వంటివి వారు కర్మకాండ తంతులను నిర్వహించేలా చేసి, చాలా కాలంగా ఉన్న వ్యవస్థ పట్ల, సాంఘిక వ్యత్యాసాల పట్ల, నీతిక్రమ శిక్షణపట్ల ఆనాటి వారికి భక్తి ప్రపత్తులున్నట్లుగా కనిపింపజేస్తున్నాయి. కాని మనం మన పూర్వీకులలో మన మనస్తత్వాన్నే చూస్తాం. అందువల్ల వారిలో కల్పనాత్మక అనాగరికులను మాత్రమే చూస్తాం. మనకు కవిత్వం కల్పన, ప్రజ్ఞల ఫలితం. కల్పన మన ఆనందానికి విలాసానికి దోహదపడే ఆటబొమ్మ. మనసు ఆడమన్నట్లుగా ఆడే నాట్యగత్తె. కాని ప్రాచీనులకు కవి ద్రష్ట, నిగూఢసత్యాలను వెలికి తీసేవాడు. నాట్యగాడు కాదు. కష్టసాధ్యమైన, నిగూఢసత్యాలను వ్యక్తం చేసేవాడు. వేదశైలిలోని రూపకం, ఉపమాలంకారాలను గంభీరమైన ప్రయోజనం కోసం, సత్యాభివ్యక్తికి వాడారు. కాని భావనను యుక్తిగా చెప్పి ఆనందింపజేయటానికి కాదు. ఈ ద్రష్టలకు భావన అంటే నిగూఢ విషయాన్ని సూచించే ప్రతీక. తర్కసహిత, వాస్తవిక ఆలోచనను భౌతిక ఊహాత్మక అభివ్యక్తిద్వారా దీప్తివంతమైన, స్పష్టమైన మేధాసందేశాన్ని మనసుకు అందిస్తుంది. దీనిని ప్రత్యక్షంగా చూడలేం. వారికి సృష్టికర్త దేహమనే ప్రతీక భావనకు అందనిది. ఇదొక దైవిక సత్యాన్ని చెబుతుంది. వారి దృష్టిలో మానవ సమాజ మంటే పదార్థ, అధిభౌతిక విశ్వంలో ప్రాణరూపంలో విశ్వపురుషుడు తనంతతానుగా వ్యక్తమవడం. మనిషి, విశ్వం రెండూ ఈ నిగూఢ సత్యానికి ప్రతీకలు, అభివ్యక్తులు.

<u>ప్రతీకాత్మకత</u>, <u>ద్వంద్వార్థరచన</u>. (Allegory)

ప్రతీకాత్మకత, ద్వంద్వార్థరచన ఒకటికాదు. అవి ఒకే నాణానికి రెండు ముఖాలు. రెంటి మధ్య తగినంత తేడా ఉంది.

ద్వంద్వార్థరచన

అమూర్త విషయాన్ని తగినంత క్లుప్తంగా, స్పష్టంగా వ్యక్తిగతం చేయటానికి, కచ్చితంగా చెప్పడానికి, ఒక గుణాన్ని వ్యక్తం చేయడానికి వాడతారు. ప్రాచీన ఉత్కంఠాత్మక (Mystery plays) రచనలలో ద్వంద్వార్థరచనను ఎక్కువగా ఉపయోగించారు. ద్వంద్వార్థరచన మేధోక్షేత్రం. ఎన్ని ఉన్నా ప్రాతినిధ్య రూపాల విషయంలో కాని, వాటి ఆధారవిషయాలలోకాని ఇది క్లుప్తంగా సూటిగా,స్పష్టంగా ఉంటుంది.

## ప్రతీకవాదం

ప్రతీక అమూర్త విషయాలను, ఆలోచనలను భావచిత్రాలుగా ప్రదర్శించలేదు. భావ చిత్రాలకు వాటికి సంబంధించిన ప్రత్యక్ష సత్యముంటుంది. అవి ఉద్దేశించిన ప్రతీకలతో వాటికి సన్నిహిత సంబంధముంటుంది. ప్రతీక ప్రాతినిధ్య సంకేతంగానో, రూపంగానో ఉన్నప్పుడు, ఈ ప్రతీకాత్మక దృక్పథాలు మేధో పద్ధతికి చెంది ఉన్నా, అప్పుడుకూడా అవి ద్వంద్వార్థ రచన వంటివి కావు.

ప్రతీక ప్రత్యక్ష సత్యాన్ని, అంతర దృష్టిని, అను భావాలను గురించి చెబుతుంది. ఇవి ఎంత అంతరంగికంగా, సూక్ష్మంగా ఉంటాయంటే వీటిని ఎంతో మేధోవంతమైన వివరణతో స్పష్టంగా, క్లుప్తంగా ప్రతీకాత్మక భావచిత్రాలద్వారానే చెప్పటం సాధ్యమవుతుంది.

ప్రతీకవాద ఉద్యమం చిత్రకళ, సంగీతాలలోని అనుభూతి వాదానికి సమకాలికం. బెర్గ్‌సన్ అవచేతన తత్త్వంతో ఉచ్ఛస్థానం పొంది, 19వ శతాబ్దపు ఆదర్శవాదంతో సమానంగా, కాల్పనిక వాద ఫలితంగా, అవరోధంలేని భూగర్భ కరెంటులా, విశ్వమార్మిక భావనతో నియోప్లాటోనిజంకు భిన్నంగా రూపొందింది. ప్రతీక వాదమంటే రూపక సమ్మేళనంతో సంక్లిష్టమైన భావాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి విలక్షణమైన వ్యక్తిగత అనుభవాలను వ్యక్తీకరించటం.

సచేతనలోని ప్రతిక్షణం మనంపొందే ప్రతి భావన, ఊహ ఒకదానికొకటి భిన్నంగా ఉంటాయి. అందువల్ల మన అనుభవాలను అనుభవించిన విధంగానే

సాంప్రదాయిక విశ్వజనీన సాహిత్య భాషలో వ్యక్తం చెయ్యలేం. ప్రతీ కవికీ తనదైన విశిష్ట వ్యక్తిత్వముంటుంది. అతడనుభవించిన ప్రతివిషయము ప్రత్యేక స్వరాన్ని, ప్రత్యేక అంశాలను కలిగి ఉంటుంది. తనవ్యక్తిత్వాన్ని, భావనలను వ్యక్తం చెయ్యటానికి ప్రత్యేకభాషను కనుగొనటం కవి కర్తవ్యం. అటువంటి భాషలో తప్పనిసరిగ ప్రతీకలను వాడాలి. ఎంతో ప్రత్యేకమైన, ఉక్కిరి బిక్కిరి చేసే అస్పష్టభావాన్ని, వివరణాత్మకంగానో, ఒక్కమాటలోనో చెప్పలేరు. పాఠకునికి దానిని సూచించగల పదచిత్రాలతోనే అదిసాధ్యం. ప్రతిమనిషికి సగం మరచిన, సగం గుర్తున్న పురాతన (ప్రాథమిక) భాష ఒకటి ఉంటుందనే నమ్మకం వల్ల ఈ సూచనా ప్రాయ పదాలసిద్ధాంతం వస్తుంది. అగ్ని (చైతన్యం)ని కవి స్వంతం చేసికొనగలడు.

అతనిలో మానవత్వం నిండుగా ఉంటుంది. నూతన కల్పనలను, భావనలను జాగ్రత్తగా వినిపింపచేయాలి. అతీతంలో తనకు లభించినది రూపమున్నదైతే రూపాన్నిస్తాడు. రూపంలేనిదైతే దానిని రూపరహితంగానే చిత్రిస్తాడు. అసభ్యమైన ఉద్వేగాలను వదలి, వ్యక్తిగత దర్శనంతో విశాలజీవితం నుంచి తనను తాను కుదించు కోవటంతో ప్రతీకవాది రచన మేధావుల కార్యకలాపంలా మిగిలింది.

**ప్రతీక :**

ఒక విషయం మరో విషయంతో సంబంధించి ఉండి దానిని సంకేతించటం లేదా దానికి ప్రాతినిధ్యం వహించటం ప్రతీకలక్షణం. అంటే తెలియని మొత్తాన్ని గణితంలో X లా చెప్పినట్లు లేదా సాంప్రదాయకంగా గుర్తించదగినవైనా కావచ్చు. ఏకత్వాన్ని 1 అంకెతోను, ద్వంద్వత్వాన్ని 2 తోను సూచించవచ్చు. పరిమాణ సంకేతాలకు బదులుగా ఇవే నిజమైన పరిమాణాలుగా గ్రహించి లెక్కించవచ్చు. భాషలోకన్న శాస్త్రాలలో ప్రతీకనుపయోగించే పద్ధతులు ఎంతో స్పష్టంగా ఉంటాయి. వ్యావహారికంలో మాట్లాడే మాటలకు శాస్త్రీయ సంకేతాలకన్నా ఎన్నో ఎక్కువ సంకేతాలుంటాయి. భాషకూడా అస్పష్టతను అంగీకరించే ప్రతీకవాద రూపమే. ఇంకా కొన్నిసార్లు ప్రతీకలను ఎంతో సమర్థంగా ఉపయోగించుకుంటుంది. సూచనకో,

సంకేతానికో పదాలను ఉపయోగించడమే కవిత్వ లక్షణం. నిర్దుష్టమైన అర్థాన్ని చెప్పడంకాదు.

అతి తక్కువ స్థాయిలో జీవశాస్త్ర సామాన్యమైన ప్రత్యేకత కూడా యంత్రాంగంగా పనిని నిర్వహించగలదు. సంకేతాలు మాత్రం మానవమేధ అభివృద్ధి చెందినకొద్దీ సంక్లిష్ట మవుతాయి. మనిషి ప్రతీకాత్మకతను సూచించే జంతువని అంటారు. కొత్త రాతియుగంలో మానవ జాతి విశ్వం గురించి కొన్ని భావనలు ఏర్పరచుకొనటంతో పర్యావరణాన్ని అర్థం చేసికోగలిగిందనటం స్పష్టం అ భావనలు మానవ ప్రవర్తనా పద్ధతులపై ఆధారపడి, కల్పనా ప్రపంచంలోని మరింత బలమైన సకేంతాలు తమను తోసివేసే వరకు బాహ్య ప్రపంచాన్ని సంకేతాలు రూపంలో నియంత్రించడానికి యథార్థంగా తోడ్పడ్డాయి.

అయితే కల్పిత కథల శిల్పం తక్కువేమీ కాదు. కల్పిత కథ కూడా మానవ జీవితం నుంచి జనించిందే. ఈ కల్పనలోని ప్రతిరూపాలు కలలలోని ప్రతీకాత్మకతతో కలిసి, భౌతికంగా జరిగే పరిణామక్రమంలో అంతర్భూతంగా ఉండి, ప్రతి దశలోను కల్పనా రూపాలను తీర్చిదిద్దుతాయి. ఈ కల్పిత రూపాలు దృష్టిగోచర సంకేతాలు నుంచి పుట్టినవైనా, ఈ చిత్ర రూప ప్రాతినిధ్యం ఎన్నడూ పూర్తి అనుకరణ కాదు. దీనికి సృజనాత్మకత, సంక్షేపించటం అత్యవసరం. చూసినదాన్ని చిత్రీకరించడం ద్వారా బాహ్యప్రపంచం ఈ ప్రతీకల రూపంలో వ్యక్తమవుతుందనా భావించవచ్చు. ఈ ప్రతీకలు కూడ సామాన్యీకరణాలే.

చిత్రకళలో వలె మూడు దృక్కోణాలున్న వాస్తవిక రూపాన్ని రెండు దృక్కోణాలున్న రూపంగా తగ్గించి చూపటం ప్రతీకాత్మక ప్రాతినిధ్యమున్న అన్నిటిలోను సామ్య సూత్రాన్ని వ్యక్తీకరిస్తుంది. నిస్సందేహమైన అనుకరణకు యథార్థమైన ప్రయోజనముంది. ప్రతీకల ద్వారా వస్తువును వియంత్రించే ఉద్దేశ్యంతోనే, కల్పనకు, వస్తువుకు మధ్య సంబంధం సన్నిహితంగా ఉంటుందని ప్రాథమికాభిప్రాయం. ఈ రోజువరకు మనం వ్యక్తుల గడ్డిబొమ్మలు తగులబెడతాం.

చరిత్ర ప్రారంభకాలంలో భావప్రసారం-చిత్రాల నుంచి భావాలకు మారిన క్రమం, భాష అభివృద్ధి చెందటం, సామాన్య భావాలను సంకేతాల ద్వారా వ్యక్తం చేయటం వంటి నిరంతరక్రమం కనిపిస్తుంది. ఆదర్శరూపాలు లేదా పురారూపాలపై ఆధారపడిన ప్లేటోకు సంబంధించిన తాత్త్వికవ్యవస్థను, ఫిలో జుడాస్ డయోనిసస్, ప్రోఫిరీ, సెంట్‌పాల్ వంటి పరపతిగల వారు క్రీస్తుశకానికి ప్రసారం చేయటం వల్ల అత్యాధునిక నాగరకత రూపొందింది. దీని భూమికలో విస్తృతమైన ప్రతీకవాదం ఆవిర్భవించి, మధ్యయుగ కళలు, విజ్ఞాన శాస్త్రాలకు మార్గదర్శకమై నేటికీ కళాసాహిత్య రంగాలపై ప్రాభావాన్ని చూపిస్తుంది.

### సంకేతాలు, సూచికలు

సంకేతాల సరళత్వం దృష్ట్యా వీటిని ప్రతీకలనుంచి వేరుగా గుర్తించవచ్చు. సంకేతాలు అవి సూచించే వస్తువులను గుర్తించి గమనించటానికి దోహదం చేస్తాయి. స్థాయిని, హోదాను సూచించే సంకేతాలను సాంప్రదాయికంగా అంగీకరిస్తున్నాం. అయినా వాస్తవమైన లేక ఊహాత్మక సామ్యాలపై ఆధారపడి సంకేతాలను ఏర్పరచుకోవచ్చు. బాణపు గుర్తులను మార్గనిర్దేశానికి ఉపయోగిస్తారు. వివిధ రంగుల లైట్లను ప్రమాదానికి, భద్రతకు ట్రాఫిక్ సంకేతాలుగా ఉపయోగిస్తారు. వర్ణమాలలోని అక్షరాలు ధ్వని ప్రాముఖ్యాన్ని సూచించేవి అయినా వాటికి రకరకాల ప్రత్యేకతలనాపాదించవచ్చు. ఈ సంకేతాలు ధ్వని, దృశ్య, భావనాత్మకమైన పదాలను సూచించే సంక్లిష్ట ప్రతీకలు, అయినా ఇవి కేవల సంకేతాలుగానే పనిచేస్తాయి. షాపు బయట 'చెప్పులు' అనే పదం చెప్పుల చిత్రంలానే పనిచేస్తుంది. వ్యక్తిగతమైన గుర్తులను పూర్వకాలంలో దస్తావేజుల ప్రామాణికతను సూచించటానికి వాడేవారు. 1300 తరువాత వీటికి బదులుగా ముద్రలు, తరువాత ఆటోగ్రాఫ్ సంతకాలతో పాటు ముద్రలు కాని, వాటికి సమానమైనవి కాని వాడేవారు.

### ప్రతీకాత్మకతలో సామ్యం.

సంకేతాలు సంబంధరాహిత్యం కలిగి ఉంటాయి. కాని ప్రతీకలు తరుచుగా పోలికను కలిగి ఉంటాయి. సింహం ధైర్యాన్ని సూచిస్తుంది. ఎందుచేతనంటే సింహాలు

ధైర్యంగా ఉంటాయని భావిస్తారు గనుక. లిల్లీ తెల్లగా ఉంటుంది కనుక స్వచ్ఛతను సూచిస్తుంది. ఇటువంటి ప్రతీకలు పోలికలా, రూపకంలా ప్రభావవంతంగా పనిచేయగలవు. అవి ఒక నైతిక ప్రకటననో, సామెతనో, లక్ష్యాన్నో సూచించేవైతే వాటిని చిహ్నాలు అని పిలుస్తారు.

ఇటువంటిదే జపాన్‌లో యోధుడిని సూచించే ప్రతీక చెర్రీబ్లాసం. ఇది అందంగా ఉంటుంది. త్వరగా వికసించి త్వరగా వాడిపోతుంది.

ప్రతీకాత్మక గుర్తులు సరిపోతే కొంతకాలం స్థిరంగా ఉంటుయి. కాని ప్రతీకలు కాలక్రమంలో పలుసామ్యాలను సూచించడానికి అవకాశం ఉంది. బృహస్పతి (గద్ద (Eagle of Jupiter) అనే దేవదూతను క్రైస్తవంలో సెయింట్ జాన్‌గా గుర్తిస్తాయి. కాని రసవాదంలో దీనిని (గ్రద్ద) ఆవిరైపోటానికి చిహ్నంగా భావిస్తారు. క్రైస్తవంలో దాతృత్వ చిహ్నమైన ఎర్రరంగు, ప్రేమ తీవ్రస్ఫూర్తిని కలిగి ఉంటుంది. కనుక, పలుకారణాలవల్ల కమ్యూనిజానికి, వర్గపోరాటానికి చిహ్నమైంది.

### అలంకారిక వ్యాఖ్యానం

ప్రాచీన (క్రీస్తు శకానికి ముందు) కాలంలో స్టోయిక్, నియో ప్లేటోనిక్ పండితులు గ్రీకు పౌరాణిక గాథలను ద్వంద్వార్థాల్లో వ్యాఖ్యానించారు. క్రీస్తు శకంలో ఈ పద్ధతులను పవిత్ర గ్రంథాలను వ్యాఖ్యానించటానికి ఉపయోగించారు. మూడవ శతాబ్దంలో ఓరిగన్ ధర్మ గ్రంథాలకు మూడు రకాల అర్థాలుంటాయని పాత నిబంధన గ్రంథంలోని యథాతథమైన అర్థమే అది చెప్పే సత్యాలకు ప్రతీకాత్మక మార్గదర్శి అని చెప్పాడు. హిబ్రూలోని బైబిల్‌ను క్రీస్తు రచనగానేకాక సాంప్రదాయిక సాహిత్య ధోరణిలో అలంకారింకంగాను అనుశీలించటానికి మార్గం ఏర్పడింది.

పునరుజ్జీవన కాలంలో పురాణ కవిత్వమంతా (Sibylline Style) లో రాసినదని ద్వంద్వార్థాను శీలనకు లోనైంది. చివరిమెట్టుగా ప్రకృతినికూడా ద్వంద్వీకరించారు. ఈ దృక్పథం వల్ల పదాలతో సృష్టింపబడిన ప్రపంచం ప్రతీకల పుస్తకమని, దీనిని వివేచనతోనే గ్రహించగలమని స్పష్టమవుతుంది.

ప్రతీక, ద్వంద్వార్థ రచన : 16వ శతాబ్దంలోని కవిత్వ గ్రంథాలు ప్రతీకకు, ద్వంద్వార్థానికీ మధ్య భేదం పాటించలేదు. రెంటినీ అలంకారాలుగానే భావించారు. అయితే తాత్త్విక సందర్భంలో ప్రతీకాత్మకత, పెద్దగా ప్రాముఖ్యం లేనిచోట్ల ద్వంద్వార్థ రచన ఉంటుందని భావించేవారు.

ద్వంద్వార్థ రచనలో అమూర్త విషయాలను రూపుకట్టించడం ఉంటుంది. రాత్(Wrath) ను కత్తిని పట్టుకుని ఆగ్రహంతో ఉన్న మనిషికి ప్రతినిధిగా భావిస్తారు. ప్రతీకకు, దృక్పథానికి ఒక దానితో మరొక దానికి తప్పనిసరి సంబంధం ఉండే అవకాశం ఉంది. దీని ఫలితంగా తరచు కథనాత్మకమైన మంత్రోపదేశం వంటి వాక్యాల కూర్పు ఉంటుంది. బన్యన్ పిలిగ్రిమ్ ప్రోగ్రెస్‌లో ప్రతీకలు ఈ పద్ధతిలో ఉంటాయి.

**అనురూప్యాలు :**

అనురూప్య సిద్ధాంతాన్ని 12వ శతాబ్దానికి చెందిన సెయింట్ విక్టర్ హగ్ ప్రతిపాదించింది. సృష్టిలోని అన్నీ సామ్యం ద్వారా ఒకదానితో ఒకటి సంబంధించి ఉంటాయి. భౌతిక రూపంలోని ప్రతి వస్తువుకూ సంబంధించిన ఉన్నత వాస్తవం ఒకటి ఉంటుంది. పైన ఉన్నదే కింద ఉంది. కింద ఉన్నదే పైన ఉంది అనే ఇంద్రజాల లక్ష్యం ఆత్మజ్ఞాన సంపాదనకు మార్గదర్శిగా పూర్వపరంపరను ఏర్పరచింది. ఈ పద్ధతిలో ఆలంకారికత లేదా రూపకం దృశ్యాదృశ్యాలను కలిపేదిగా, కవితాత్మక ప్రతీకాత్మకత విశ్వంలోని నిగూఢ సంబంధాలను వ్యక్తం జేసేదిగా ఉంది.

**ఆధునిక ప్రతీకవాదం :**

కవిత్వంలో ప్రతీకల ప్రయోజనం 19వ శతాబ్దిలో ఎక్కువగా గుర్తింపు పొందింది. క్రైస్తవ ద్వంద్వార్థ రచన కన్న, ఈ కాలంలో ప్రతీకలలోని వాస్తవాన్ని చెప్పవలసిన ఆవశ్యకత కలిగింది. టైజర్ (Tyger) లో బ్లేక్ సృష్టికర్త, విధ్వంసకుడు అయిన భగవంతుని సూచిస్తాడు. కాని ప్రతీక మాత్రం నిగూఢంగానే ఉంది. ఆధునిక ప్రతీకవాదికి మార్మికత అనేది కళలో ఒక ప్రత్యేకమైన రంగం. ఎంత నిగూఢంగా ఉన్నా అవగాహనకు అందేది పునరుజ్జీవన ప్రతీకవాదం. ఆధునిక ప్రతీకవాదం

తర్కానికి అందని సమాచారాన్ని. కల్పన ద్వారా సచేతన మార్మికతను అర్థం చేసుకొనడానికి ఉద్దేశించినది.

ఈ లోగా ఫ్రాయిడ్ మనసులోని అచేతనమనసును కనుగొన్నాడు. ప్రతీకల పదకోశం ప్రకారం ఇది ఆంతరంగిక జీవితాన్ని వ్యక్తం చేయటానికి, దాచటానికి ఉపయోగపడుతుందని అర్థం. యూంగ్ ఈ ప్రతీకలకు విశ్వజనీన ప్రామాణికత ఉండాలని, సర్వమానవ మానసిక మార్పులను సూచించే ఆధారాలుగా ఇవి ఉండాలని భావించాడు. ఈ విధంగా ప్రతీకవాదం సామాన్యార్థంలో మానసిక శోధనకు మార్గమైంది. అనంతరం సాంస్కృతిక, నిర్మాణాత్మక నృశాస్త్రంలో ప్రత్యేక నైపుణ్యాలకు మార్గం వేసింది. మారిస్ వేలెన్సీ (కొలంబియా విశ్వవిద్యాలయం)

**ప్రతీక వాదులు :**

19వ శతాబ్ది చివరిలోని ఫ్రెంచి, బెల్జియం రచయితలు కఠినమైన సాంప్రదాయిక ఫ్రెంచి కవిత్వ సూత్రాలకు వ్యతిరేకంగా ఉద్యమించినవారు. అనుభూతివాద చిత్రకారులకు వలె కళకు అంతకు ముందున్న ఆనువంశిక దృక్పథాలను తృణీకరించారు. వ్యక్తుల విశిష్టమైన ఉద్వేగ భరిత అనుభవాల, ముఖ్య లక్షణాలను నేరుగా వ్యక్తం చేయటానికి ప్రయత్నించారు. అంతర ప్రపంచంలోని వాస్తవికతను, సౌందర్యాన్ని బాహ్య ప్రపంచంలోని ప్రతీకల ద్వారా దర్శించారు.

**పుట్టుక :**

చార్లెస్ బాద్‌లేర్ రాసిన (Les fleurs du mai - 1857) ఆదరించటంతో ప్రతీకవాద ఉద్యమం మొదలైంది. ఎడ్గార్ అలెన్‌పో ప్రతిపాదించిన విమర్శనాత్మక కవితా సిద్ధాంతాలు కూడా దీనిని ప్రభావితం చేశాయి. ప్రతీకవాదులలో మొదటివారు ఆర్థర్ రింబాడ్, పాల్‌వెర్‌లేన్. ప్రతీక వాదుల ప్రణాళికను 1886లో లేపిగారోలో జీన్‌మోరియస్ ప్రకటించాడు.

వివరణాత్మక వాస్తవిక వాదంపైన పార్నీసియస్ కవిత్వ వ్యక్తి నిరపేక్ష పద్ధతులపైన యుద్ధం ప్రకటించాడు.

తరువాతి కాలంలో చిన్నచిన్న పత్రికలు కొత్త ప్రణాళిక విమర్శకుల రచనలు గొప్ప వివాదాస్పద సృజనశీల వాతావరణాన్ని కల్పించాయి.

**సిద్ధాంతాలు :**

అభివ్యక్తి రూపాలన్నిటికన్న కళ మిన్న అని ప్రతీకవాదులు నమ్మేవారు. వ్యక్తిగతానుభవానికి అత్యంత విలువ నిచ్చేవారు. కవి స్వంతమైన ఆంతరమైన కలను వ్యక్తం చేసే కళా సృష్టి చేయటమే వారి లక్ష్యం. సాంప్రదాయ ఛందస్సుల నుంచి కవిత్వానికి విముక్తి లభించి, రకరాకాల లయలతో ఎటువంటి అడ్డంకులు లేకుండ కవిత్వ సృష్టి జరిగింది. సంగీత సూత్రాలను కవిత్వం అనుసరించాలని, అవ్యక్తమైన దాన్ని వ్యక్తం చేయటానికి సంగీతమే సామాన్య మార్గదర్శి అని భావించారు.

భాషకున్న పునర్విచారణ, స్వర నాణ్యతలను నొక్కి చెప్పేవారు. కల్పనను, అనుభూతులను దిగ్భ్రాంతి కలిగించే విధంగా ప్రదర్శించేవారు. బాద్లేర్ చెప్పినట్లుగా అజ్ఞాత ప్రపంచపు, అంధకారాన్ని, తికమక పెట్టే ఏకతను పునః స్మరించేలా చేసేవారు. ప్రతీకవాద కవులు వచన పద్యాన్ని ఎక్కువగా ఉపయోగించారు. ఫ్రీవెర్స్‌ను ఎక్కువగా ప్రచారంలోకి తెచ్చింది కూడావీరే.

**ప్రధానమైనవారు :**

రింబాడ్ వెర్‌లేన్, వేలరీ, స్టీఫెన్ మలార్మే, జూల్స్ లెఫర్గ్, హెనెడి రెనీర్, రెనెగిల్ ముఖ్యమైన ప్రతీకవాదులు. ప్రతీకవాద సిద్ధాంతాలను మారిస్ మేటర్‌లింక్ నాటకానికి, రెమిదెగార్మా విమర్శకు, జోన్స్ కార్ల్ హుమెన్స్ నవలకు అనువర్తింపజేశారు. పాల్ క్లాడెల్ ఈ ఉద్యమానికి ప్రత్యక్షవారసుడు. ప్రతీకవాదుల సౌందర్య ఆదర్శాలకు, జీవిత విధానానికి మార్సెల్ ప్రౌస్ట్‌నవలలు తుది తార్కాణాలుగా నిలిచాయి.

**క్షీణత - అనంతర ప్రభావాలు.**

ప్రతీకవాదం 1900 తరువాత అతిగా అలంకృత కళారూపమైనది. ఒకప్పుడు ప్రతీకవాదులు భౌతిక సమాజాన్ని అధిక్షేపిస్తూ తమను తాము అతినాగరికులుగా భావిస్తూ వ్యంగ్యంగా క్షీణతావాదులమని చెప్పుకున్నారు. విమర్శకులు దీనిని హేళనగా భావిస్తారు. ప్రతీకవాదుల సాంకేతిక పరిశోధనలకు ప్రాముఖ్యం ఉంది. విలియం

బట్లర్ ఈట్స్, టి.ఎస్.ఇలియట్, జేమ్స్ జాయ్స్‌లు ప్రధానంగా దీనికి కారకులు. వీరి రచనల ద్వారా ప్రతీకవాదం ఆధునిక సాహిత్య సిద్ధాంతాలను ప్రభావితం చేసింది.

**ప్రతీక (Symbol) నిర్వచనం :**

1. "The word symbol devices from the Greek verb Symballein, meaning to put together and related noun symbolon meaning mark, token or sign.
   Princetion encyclopedia of poetry & poetics ed : Alex Preminger, Macmillan Reference Books -1986. - Page. No:833,
2. The function of the symbol is to represent a reality or a truth and to reveal them either instantaneously or gradually. The rela tionship of the symbol to a direct and intimate and also as some what indirect and distant. The symbol is sometimes identified with the reality, that it represents and sometimes regarded as a pure transparency of it.
   New Encyclopedia of BRITANNICA (Vol-17). Pub:- Encyclopedia Britannica. Inc - 1981 - 89, P. 901,
3. Some thing associated with something else that it signifies or represents.
   - Encyclopedia Americanna.
   Pub:- Americanna Corporation. New York - P.166
4. Symbol is the term given to a visible object representing to the mind the resemblence of something which is not shown but realised by association with it.
   Encyclopedia Britannica. Vol:XXVI, P. No:-224,
5. **Symbol:-** Anything that stands or represents something else beyond it - usually an idea conventionally associated with it. The Concise oxford Dictionary of Literary Terms. - Chris Bal Dick - Oxford University Press - 1996. P. 218.
6. If a poet says "My rose" and is speaking about a rose, we have an image, even though we do not have a figure of speech. If a poet says "My rose" and, we gather, is speaking not really or chiefly about a rose but about something else-let's say the transience of beauty - we can say that the poet is using the rose as a symbol.

Literature : Thinking, Reading & Writing Critically Second Edition Sylvan Barnet, Morton Berman.William Burto, William E.Caih, Longman - 1996. P. No. 905.

7. **Symbol :-** The literary Symbol, defined straight forwardly by Kant (who, in his critique of judgement, 1790,calls it an 'aesthetic idea')in terms of the 'attributes' of an object 'which serve the rational idea as a substitute for logical presentation, but with the proper function of animating the mind by opening out for it a prospect into a field of kindred representations stretching beyond its ken' (his examples are the eagle that stands for Jove, and the peacock that represents Juno) takes on a special significance for Romantics early (Coleridge) and late (Yeats). Yeats indeed goes so far as to maintain that a 'continuous indefinable symbolism' is 'the substance of all style' (The Symbolism of Poetry, 1900), and for him the excellence of a symbol consists in the suggestiveness that derives from the suppression of a metaphor's directly apprehensible terms of reference : 'as a sword-blade may flicker with the light of burning towers', so the symbol evokes unseen worlds.

Dictionary of modern critical terms by Roger Fowler, Routledge & Kegan Paul, London, 1973, P. 188.

8. **Symbol:-** The word symbol derives from the greek verb "symballein" to throw together and its noun symbolom 'mark', 'token' or 'sign'. It is an object, animate or inanimate, which represents or 'stands for' something else.

A. Dictionary of Literary Terms - J.A. Cuddon, Indian Book Company - Andre Deutscit, P. 655.

9. **Symbol:-** A symbol in the broadsense of the term is anything which signifies something else. In this sense all words are symbols. As commony used in discussing Literature however symbol is applied only to a word or set of words that signifies an object or event which itself signifies something else that is, the word refers to something which suggests a range of reference beyond itself.

- A Glossary of Literary Terms - M.H. Abrams, Cornell University - 1986.

10. **Symbol:-** Something that represents something else. New standard Encyclopedia (14.Vol).

- Standard Educational Corporation - chicago - Page:962,

11. Sign representing something that has an independent existence.

The New Illustrated Columbia Encyclopedia. Columbia University Press, New York - 1979 - Page No: 6601,

12. A symbol is the verbel parallel to a pattern of experience.
- Keneth Burke

13. A symbol as I understood it, is the form of one plae that represnts a truth of another".
- Sri Aurobindo, Letters on yoga.

14. **Symbolism:-** Symbolism is an attempt by carefully studied means a complicated association of ideas represented by a medley of metaphores to communicate unique personal feelings.
- Edmond Wilson

15. **Symbolism :-** "Symbolism can therefore be def ed as the act of expressing ideas and emotions not by describing them directly nor by defining them through overt comparisions with concrete images, but by suggesting what these ideas and emotions are by recreating them in the mind of the reader through the use of unexplained symbols".
- Charles Chadwik

16. **Symbolism:-** Trying to Suggest the invisible by means of material objects by the use of sound in poetry to express sentiments.
Elsevier's International Dictionary of Literature and Grammer, Gvido Gomez De Silva, Elsevier - 1991, P. 487.

1. ఏ భావాన్నైనా ఒక ప్రతీక లేదా సంకేతాన్నుపయోగించి ప్రతిబింబించవచ్చు, ఒక భావానికి గాని, విషయానికి గాని ప్రాతినిధ్యం వహించడమన్నది ప్రతీక విధానంగా మల్లార్మే అభిప్రాయపడ్డారు.
శ్రీశ్రీ ప్రతీకతా శిల్పం, మాకినీడు సూర్య భాస్కర్
తెలుగు వైజ్ఞానిక మాస పత్రిక – జూలై 1992
కవిత్వంలో నేరుగా చెప్పటమనేది వినాశనమైతే ప్రతీకాత్మకంగా చెప్పడం సృజన శీలత (to name is to destroy to suggest is to create) అంటారు మల్లార్మే.
మహాప్రస్థానంలో సింబాలిజం, మిరియాల రామకృష్ణ.
తెలుగు వైజ్ఞానిక మాసపత్రిక నవంబరు – 1981.

2. ప్రతీకలో ఒకటి కనిపిస్తుంటుంది. మరొకటి లుప్తమవుతుంది. ఈ లుప్తమైన అంశం సృష్టిలోని వాస్తవస్థితిని సుబోధకం చేయగలిగితే ప్రతీక - కాల్‌రిడ్జ్.

3. ప్రతీకవాదం శబ్దమునకు భావ ప్రకటనము కాక, సూచనమే ప్రధానమని, వాతావరణ కల్పనమే ప్రధాన లక్షణమని భావించినది.
ఆధునికాంధ్ర కవిత్వము. సంప్రదాయాలు-ప్రయోగములు. సి. నారాయణరెడ్డి.

4. సింబాలిజంలో ఒకే వస్తువు ఉంటుంది. బయటకి కనిపించేది భౌతిక వస్తువు. మాములు కళ్ళకు కనిపించకుండా లోపల ఉండేది రెండో వస్తువు. అంటే ఒక వస్తువు యొక్క భౌతిక తాత్త్విక రూపాలను కవి గ్రహిస్తాడు. ఒకటి చర్మచక్షువుతో, రెండోది జ్ఞాన చక్షువుతో".
నా డైరీ రక్తరేఖ - గుంటూరు శేషేంద్ర శర్మ. - పు. 60.

యాంత్రికమైన సాంకేతికత కంటే భిన్నమైంది. అనుభూతి జన్యమైంది. వాచ్యత కంటే సూచ్యత ప్రధానమైంది. వస్తువులను ప్రతీయామానం చేయటం కాక వస్తుతత్త్వాన్ని వ్యక్తీకరించేది ప్రతీక
- శేషేంద్ర కవిత్వానుశీలనం, పెన్నా శివరామకృష్ణ, పు. 63

5. ఒక వస్తువు హేతుబద్ధత కారణంగా కాని సమాచార సంబంధాలవల్ల గాని, మరొక వస్తువును వ్యంజింపచేసినపుడు లేక దృశ్యమాన విషయం వర్ణనా సామర్థ్యం చేత మరొక విషయాన్ని స్ఫురిప చేసినపుడు కాని ప్రతీక అనవచ్చు.
పు. 45.

6. ప్రతీక మూల తత్త్వమునకు యదార్థమగు ప్రతికృతి లేక ప్రతిబింబం కాదు. ప్రతీకచే వస్తువు సూచితమగు వాస్తవమును పరిత్యజించుటయనగా దానిని యథా తథముగ చిత్రింపకుండటమాత్రమే దానితోడి సంపర్కలేశము లేకుండుటగాదు".
ఆధునికాంధ్ర కవితా సమీక్ష - కె.వి.ఆర్. నరసింహం, 1982, పు. 86

7. ప్రతీక ఒక భావానికి, ఒక విషయానికి కవిత్వంలో మరొక విషయాన్ని ప్రతినిధిగా ఉంచడం అన్నది స్థూలంగా కన్పించే విషయం. అంటే ఆ విషయాన్ని

ప్రత్యక్షంగా సూచించకుండా పరోక్షంగా సూచిస్తుంది ప్రతీక.

నా దేశం నా ప్రజలు విప్లవ కావ్యవిమర్శ, ముదిగొండ వీరభద్రయ్య, పు. 71

8. ఒక శబ్దంకానీ, శబ్ద సముదాయం కాని, ఒక వస్తువునో, క్రియనో, సంఘటననో సూచిస్తూ అది తిరిగి వేరొక అంశాన్ని సూచించినప్పుడు అది ప్రతీక అవుతుంది. ఆ శబ్దాలు ఏ సాధరణార్థాన్ని సూచిస్తున్నాయో ఆ ఆవరణను దాటి ఉన్న అంశాలను అది ధ్వనింపచేస్తుంది.

   – పాశ్చాత్య-సాహిత్య విమర్శ చరిత్ర సిద్ధాతాలు, వడలి మందేశ్వరరావు, 1994, పు. 200.

9. అలంకారంలోని వాచ్యతను-లోకాన్ని-తొలగించి, దాన్ని సాంద్రబిందువుగా చేస్తే ప్రతీకవుతుంది.

   – సాలభంజిక, తుమ్మపూడి కోటేశ్వరరావు, 1994, పు. 161.